- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
18-11-2026

సంపుటి : 01 సంచిక :234 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 234 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

మోదీ చాలా 'టఫ్ మ్యాన్

- క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు
- మనీలాలో జరిగిన క్వాడ్ సదస్సులో మోదీని 'గట్టి వాడు'గా అభివర్ణించిన ట్రంప్
- క్వాడ్ సమావేశంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతల చర్చలు
- 85 మిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ యాక్సిలరేటర్ ప్రారంభమిస్తామన్న ట్రంప్
- సముద్ర జలాల రక్షణ కోసం 4 దేశాల సైన్యాలతో ఉమ్మడి మిలిటరీ విన్యాసాలు
- అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో భారత్, జపాన్ భాగస్వామ్యాన్ని కొనియాడిన ట్రంప్



03

ఐపీఎల్ కు గుడ్

బై చెప్పిన ధోనీ..

- ఐపీఎల్ నుంచి ఆటగాడిగా తప్పుకున్న ఎంఎస్ ధోనీ
- సీఎస్‌కే మెంటార్‌గా సరికొత్త బాధ్యతలు
- రిలీజ్ లిస్టులో తన పేరు చేర్చండంటూ ధోనీ వ్యాఖ్య
- ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేమన్న శ్రీనివాసన్
- ఐదు ఐపీఎల్ ట్రోఫీలు అందించిన రికార్డు కెప్టెన్



03



సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు

ప్రస్తావన ఏదీ?

- 'తెలంగాణ గుండెల్లో ఉంటే ఈ అంశాన్ని ఎందుకు విస్మరించారు?'
- కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్
- రాష్ట్ర ఏర్పాటు సోనియా దయాభిక్ష కాదని వ్యాఖ్య
- ప్రజల పోరాట ఫలితంగానే తెలంగాణ ఆవిర్భావం
- ఉద్యమ కాలం నాటి పాదయాత్రను గుర్తు చేసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాదయాత్ర
- సామాజిక మాధ్యమ వేదికగా కాంగ్రెస్‌పై విమర్శలు

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ప్రశ్నించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది రాష్ట్ర ప్రజల సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు.

-మిగతా 3 లో

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ

ఇవ్వండి

- రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ
- సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూల స్పందన
- తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం
- నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం
- 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బహుళ ప్రయోజనాల ప్రాజెక్టు

03

ఛత్తీస్‌గఢ్ సీఎంకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి నిరభ్యంతర పత్రం జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కోరారు. రాయ్‌పూర్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయనతో సమావేశమై ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి.. ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో కేవలం 33 ఎకరాలే ముంపునకు గురయ్యే ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, పరిహారం, పునరావాస ఖర్చులను నిబంధనల ప్రకారం భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పూర్తయిన బ్యారేజీకి అనుమతులు లభిస్తే గిరిజన, వెనుకబడిన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ఊరట లభిస్తుందని వివరించారు.





వాషింగ్టన్‌ను వణికిస్తున్న ఇరాన్

మాస్టర్ ప్లాన్!

- వాషింగ్టన్‌లో డర్టీ బాంబ్ పేల్చేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందన్న అమెరికా ఇంటెలిజెన్స్
- ట్రంప్ ప్రభుత్వ ఉన్నతాధికారులను రసాయన ఆయుధాలతో టార్గెట్ చేసే అవకాశం
- ముష్ష నేపథ్యంలో యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్‌ను మిలిటరీ బేస్‌కు తరలింపు
- అమెరికా గడ్డపైనే రేడియోధార్మిక పదార్థాలు సిద్ధం చేసి ఉండవచ్చని నిఘా వర్గాల అనుమానం
- రసాయన ఆయుధ ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఇరాన్

03



03

పోటీ కాదు, సహకారమే

మన భవిష్యత్తు:

- ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ
- భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ
- 'యాక్ట్ ఈస్ట్' విధానంతో ఇరుపక్షాల మధ్య బంధం మరింత బలోపేతం
- వికసిత భారత్ 2047, ఆసియాన్ విజన్ 2045 లక్ష్యాలు కీలకం
- ప్రస్తుత ప్రపంచానికి శాంతి, స్థిరత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య

భారత్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో

కీలక మార్పులు..ఆ కంటెంట్‌కు చెక్!

- భారత్‌లో ఇన్‌స్టా కంటెంట్ సిఫార్సుల్లో మెటా కీలక మార్పులు
- అశ్లీల, హింసాత్మక కంటెంట్‌ను తగ్గించేందుకు కొత్త ఏఐ టెక్నాలజీ వినియోగం
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాల తర్వాతే ఈ మార్పులు జరిగినట్లు విశ్లేషణ
- గత ఏడాదితో పోలిస్తే ఫిర్యాదులు సగానికి తగ్గాయని తెలిపిన మెటా
- యూజర్ల కోసం అందుబాటులోకి సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ వంటి ఫీచర్లు

03



అభయ హస్తం కాదు..

మొండి హస్తం!

కాంగ్రెస్ హామీల అమలుకు మూడేళ్లయినా దిక్కులేదు



- మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో పోల్చి అమలు విస్మరించారు
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైంది?
- ఇప్పటికే 38 కేబినెట్ సమావేశాలు జరిగినా పురోగతి లేదని విమర్శ
- 420 హామీలతో ప్రజల్లో ఆశలు కల్పించారని ఆరోపణ
- గాంధీభవన్ వేదికగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని వ్యాఖ్య
- ఖర్గే, రేవంత్, శ్రీధర్‌బాబు, భట్టికి ప్రశ్నలు
- కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 17మహాప్రభ

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు మూడేళ్లు పూర్తయినా.. హామీల అమలులో పురోగతి లేదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గొప్పగా చెప్పుకున్న అభయహస్తం.. హామీలను అమలు చేయని మొండి హస్తంగా మారిందని మండిపడ్డారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానంగా భావించి తూచా తప్పకుండా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. మూడేళ్లయినా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

-మిగతా 3 లో



03

షాంఘై భేటీకి పాక్‌కు ఆహ్వానమా?

- పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ వైఖరిలో మార్పేమైనా వచ్చిందా?
- ఉగ్రవాదంపై చర్యలు తీసుకుందా అంటూ కాంగ్రెస్ ప్రశ్న
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం
- పాక్ విషయంలో కేంద్రం విధానమేంటో స్పష్టం చేయాలని డిమాండ్
- ఈ నెల 20 నుంచి 22 వరకు ఢిల్లీలో షాంఘై సదస్సు
- పాక్ తరపున హాజరుకానున్న వాతావరణ మార్పుల శాఖ మంత్రి



కొత్త పింఛనుదారులకు

శుభవార్త

- కొత్త పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు
- 19న ఖాతాల్లోకి నగదు!
- 4,63,857 మంది లబ్ధిదారులకు తొలి విడత సాయం
- ఒక్కొక్కరి ఖాతాలో రూ.2 వేల చొప్పున జమ
- ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ కార్యక్రమం
- కొత్త పింఛన్లలో అత్యధికంగా వితంతువులే
- 2.77 లక్షల మందికి వితంతు పింఛన్లు మంజూరు
- రాష్ట్రంలో 45 లక్షలకు చేరనున్న పింఛనుదారుల సంఖ్య

హైదరాబాద్:నవంబర్ 17మహాప్రభ

తెలంగాణలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఈ నెల 19న కొత్త పింఛన్ల మొదటి విడత నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కొత్తగా పింఛన్ల మంజూరైన ఒక్కొక్కరికి రూ.2 వేల

-మిగతా 3 లో

మనీలాలో గురుద్వార ఖల్సాను సందర్శించిన ప్రధాని మోదీ



మనీలా: నవంబర్ 17మహాప్రభ

ప్రధాని మోదీ ప్రస్తుతం ఫిలిప్పీన్స్ టూరులో ఉన్న విషయం తెలిసిందే. ఆయన మనీలాలో ఉన్న గురుద్వార ఖల్సా దివాన్‌ను సందర్శించారు. అక్కడ ఆయన ప్రత్యేక పూజలు చేశారు. 49వ ఏషియాన్ సదస్సులో పాల్గొనేందుకు మోదీ పిలిప్పీన్స్ వెళ్లారు. సోషల్ మీడియా ఎక్స్‌లో ఆయన ఆ పర్యటన గురించి షేర్ చేశారు. సిక్కుల ప్రార్థనమందిరాన్ని విజిట్ చేసినట్లు ఆయన తన ఎక్స్‌లో వెల్లడించారు.ఖల్సా దివాన్ మనీలాలో అత్యంత పురాతన గురుద్వార. అయితే ఇక్కడ రీడెవలప్మెంట్ మొదలుపెట్టారు. దీని కోసం జరిగిన శంకుస్థాపనలో ఇవాళ ప్రధాని మోదీ పాల్గొన్నారు. వందేళ్ల క్రితం నాటి గురుద్వారను విజిట్ చేయడం సంతోషంగా భావిస్తానని అన్నారు. గురుద్వార పునర్ నిర్మాణ ప్రక్రియకు మోదీ శ్రీకారం చుట్టారు. భారత్-ఫిలిప్పీన్స్ సంస్కృతికి ఖల్సా దివాన్ గురుద్వార వారధిగా నిలిచిందన్నారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ఈ గురుద్వార కీలకంగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. గురు సాహిబ్‌ల బోధనలు ప్రేరణ ఇస్తాయని, ప్రపంచవ్యాప్తంగా సిక్కు మతస్థులకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, ఇతరులకు సేవ చేయడంలో ముందు ఉంటారని, ఉత్తమ భవిష్యత్తును నిర్మిస్తుంటారని మోదీ తన ఎక్స్‌లో తెలిపారు. 23వ ఏషియాన్ సదస్సులో పాల్గొనేందుకు సోమవారమే మోదీ ఫిలిప్పీన్స్ చేరుకున్నారు.

కీవ్‌లో రెండు బ్రిడ్జ్‌లపై రష్యా దాడి: మేయర్ క్లిచ్‌కో



కీవ్: నవంబర్ 17మహాప్రభ

ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసిందని, దీంతో కీవ్‌లో రెండు బ్రిడ్జ్‌లు ధ్వంసమైనట్లు ఆ నగర మేయర్ విటాలీ క్లిచ్‌కో తెలిపారు. కీవ్‌లోని ఉత్తర, దక్షిణ బ్రిడ్జ్‌లను క్షిపణులతో టార్గెట్ చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ దాడుల వల్ల నగరంలో నీటి, విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందన్నారు. మరో వైపు రష్యాకు చెందిన క్రిమియా ద్వీపంలో ఉన్న కీలక బ్రిడ్జ్‌లను ఉక్రెయిన్ టార్గెట్ చేసింది. వరుసగా రెండోరోజు కీర్చ్ బ్రిడ్జ్‌ను టార్గెట్ చేసినట్లు తెలిసింది. రష్యా మళ్లీ తమపై దాడి చేసే అవకాశాలు ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన దాడి వల్ల కీవ్‌లో భారీ శబ్దాలు వినిపించినట్లు క్లిచ్‌కో పేర్కొన్నారు. కీలకమైన వ్యవస్థలకు నష్టం జరిగిందన్నారు.

క్షమాపణ మనస్ఫూర్తిగా చెప్పాలి

ఎంపీ రౌత్ క్షమాపణను అంగీకరించని సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ నవంబర్ 17మహాప్రభ

సీజేఐ సూర్యకాంత్, న్యాయవ్యవస్థపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణలో శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్, జర్నలిస్టు నిఖిల్ వాగ్లేలకు అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. రౌత్ క్షమాపణపై సంతృప్తి చెందని ధర్మాసనం, భాషలో సంయమనం అంటే ఏమిటో అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడికి తెలిసుండాలని వ్యాఖ్యానించింది. 'మీరు క్షమాపణ చెప్పారు. కానీ ఇంతటి తీవ్రమైన అంశంలో క్షమాపణ మనసులో నుంచి రావాలి తప్ప, మెదడులో నుంచి కాదు' అని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పంచోలీతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రౌత్ క్షమాపణ చెప్పినప్పటికీ, ఆ తర్వాత కూడా సుప్రీంకోర్టుపై సోషల్ మీడియాలో పోస్టులు చేశారని పిటిషనర్ తెలిపారు.

విద్యార్థి వీసాలకు 4 ఏండ్ల పరిమితి చెల్లదు

-బోస్టన్ జడ్జి తీర్పు.. ట్రంప్‌నకు మరోషాక్



వాషింగ్టన్, నవంబర్ 17మహాప్రభ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయానికి న్యాయస్థానంలో మరో ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, జర్నలిస్టులు తమ వీసాలపై అమెరికాలో ఉండే కాలానికి పరిమితి విధించాలని ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను అమెరికా ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) జూలైలో ఈ విధానాన్ని ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకుంటే తప్ప విదేశీ విద్యార్థులు దేశంలో 4 ఏండ్లకు మించి ఉండకుండా చేయడమే దీని ఉద్దేశమని తెలిపింది. బోస్టన్ ఫెడరల్ జడ్జి ఎఫ్ డెన్నిస్ సేలర్ సోమవారం ఇచ్చిన తీర్పులో డీహెచ్ఎస్ ప్రతిపాదనను 'ఏకపక్షమైనది, విచక్షణారహితమైనది, అధికార దుర్వినియోగమైనది, చట్టానికి అనుగుణం కానిది' అంటూ పేర్కొన్నారు.

అమ్మ భయపడటం నా జీవితంలో ఒక్కసారి కూడా చూడలేదు

న్యూఢిల్లీ నవంబర్ 17మహాప్రభ

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ తన తల్లిలోని ధైర్యాన్ని గురించి గొప్పగా చెప్పారు. తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకం 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆవిష్కరణ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. తన తల్లి ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు, ఏకంగా నాలుగుసార్లు క్యాన్సర్ జయించిందని తెలిపారు. ఆమెలో ధైర్యం ఎక్కువని, తన తల్లి భయపడటాన్ని తాను తన జీవితంలో ఒక్కసారి కూడా చూడలేదని అన్నారు.తన తల్లి దశాబ్దాలుగా ఎదుర్కొన్న వ్యక్తిగత ఆరోగ్య సమస్యల గురించి కూడా రాహుల్‌గాంధీ మాట్లాడారు. తన పుస్తకంలో ఆమె ఈ విషయాలను తక్కువ చేసి చూపినప్పటికీ.. వాస్తవానికి



ఆమె నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించిందని తెలిపాడు. అమ్మరాసిన పుస్తకంలో మీరు చదువుతున్నది నాన్న చనిపోక ముందు అమ్మ గురించని, ఆ తర్వాత ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నారని చెప్పారు. అమ్మానాన్నలు నిన్ను ఎంతో ప్రేమించారు, నాన్న నిన్ను చూసి ఎంత గర్వపడేవారో నేను మాటల్లో చెప్పలేను అని అక్కడే వేదికపై ఉన్న తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రాను ఉద్దేశించి అన్నారు. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య తర్వాత ఎదురైన కష్టకాలం గురించి సోనియాగాంధీ మాట్లాడుతూ.. భద్రతాకారణాలవల్ల రాహుల్ గాంధీ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి వేరొక అమెరికన్ కళాశాలకు నకిలీ గుర్తింపుతో బదిలీ అయ్యాడని చెప్పారు. తండ్రి మరణానంతరం రాహుల్‌ను అమెరికాలోని హార్వర్డ్‌లో చేర్పించామని, అయితే రాహుల్‌కు సెక్యూరిటీ వారు అంగీకరించలేదని, అది ఇతరులకు ప్రమాదకరమని చెప్పి తిరస్కరించారని సోనియా గుర్తుచేసుకున్నారు. దాంతో మరో కళాశాలలో నకిలీ గుర్తింపుతో చేర్పించామని చెప్పారు.

178 సంస్థలపై సైబర్ దాడి

-జాబితాలో జూమ్, బీబీసీ, సీఎన్ఎన్



న్యూఢిల్లీ నవంబర్ 17మహాప్రభ

జూమ్, బీబీసీ, సీఎన్ఎన్, హెచ్ఎస్‌బీసీ, ఐకియా వంటి సంస్థలకు చెందిన వెబ్‌సైట్లలో హ్యాకర్లు హానికర కోడ్‌ను చొప్పించినట్లు సైబర్ భద్రత దర్యాప్తులో తేలింది. ఈనెల 16న ఈ వెబ్‌సైట్లను సందర్శించిన వినియోగదారుల ఆర్థిక, వ్యక్తిగత సమాచారం ముప్పులో పడే అవకాశం ఉన్నదని దర్యాప్తు పేర్కొన్నది. ప్రపంచ వ్యాప్తంగా 178 సంస్థల వెబ్‌సైట్లలోకి హ్యాకర్లు రహస్యంగా హానికర స్క్రిప్ట్‌ల్రను చేర్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. వెబ్‌సైట్లకు వేర్వేరు నమూనాలను పరీక్షించడానికి, వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి కంపెనీలు ఉపయోగించే ఆప్టిమైజ్‌లీ ప్లాట్‌ఫామ్‌లోని లోపాన్ని దాడికి వాడుకున్నట్లు తెలిసింది.ప్రధాన వెబ్‌సైట్‌లో మార్పులు చేయకుండానే కోడ్‌ను చేర్చడానికి ఈ ప్లాట్‌ఫామ్ సంస్థలకు అవకాశం ఇస్తున్నది. సైబర్ భద్రత సంస్థ రిపోర్ట్ యూఆర్ఐ ప్రకారం, ఆప్టిమైజ్‌లీ ఖాతా నమోదు ప్రక్రియలోని బలహీనతను హ్యాకర్లు వినియోగించుకున్నారు. కస్టమర్ల ప్రాజెక్టుల్లోకి హానికర జావాస్క్రిప్ట్‌ల్రు చొప్పించారు. సేల్స్‌ఫోర్స్, ఫాక్స్ న్యూస్ వెబ్‌సైట్లు కూడా ప్రభావితమైనట్టు వెల్లడైంది.

డిజిటల్ అరెస్టు పేరుతో న్యాయవాదికి 4 కోట్ల టోకరా

పహల్గాం ఉగ్రదాడితో లింకుందని బెదిరింపు



నోయిడా, నవంబర్ 17మహాప్రభ

పహల్గామ్ ఉగ్రదాడితో సంబంధాలున్నాయంటూ ఒక రిటైర్డ్ న్యాయవాదిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు అతడి నుంచి రూ.4 కోట్లు బదిలీ చేయించుకున్నారు. ఈ ఘటన నోయిడా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. న్యూయార్క్‌కు చెందిన రిటైర్డ్ న్యాయవాది అతుల్ తల్వార్‌కు అక్టోబర్ 17న కొందరు సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేశారు. తాము ఎన్ఐఏ, సీబీఐ అధికారులమని పేర్కొంటూ 'మీకు ఉగ్రవాదులతో సంబంధాలున్నట్టు మాకు సమాచారం అందింది' అంటూ తల్వార్‌ను బెదిరించారు.అలా అతడిని 20 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ లో ఉంచారు. వీడియో, ఆడియో వాట్సాప్ కాల్స్ ద్వారా తల్వార్‌ను నిరంతరం గమనిస్తున్నట్టు రకరకాలుగా బెదిరిస్తూ అతడి నుంచి రూ.4 కోట్లను క్రిప్టో కరెన్సీ రూపంలో బదిలీ చేయించుకున్నారు. డబ్బు బదిలీ చేసిన తర్వాత సందేశాలకు స్పందించకపోవడంతో మోసపోయినట్టు తల్వార్ గుర్తించారు. దీంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సైబర్ సెక్యూరిటీ డీసీపీ శైవ్య గోయల్ తెలిపారు.

అమెరికా అధికారుల అదుపులో ప్రపంచ మోస్ట్ వాంటెడ్ గర్ల్‌ఫ్రెండ్ వెరా డిజ్క్‌మాన్స్..!

న్యూఢిల్లీ నవంబర్ 17మహాప్రభ

తనను తాను 'ప్రపంచ మోస్ట్‌వాంటెడ్ గర్ల్‌ఫ్రెండ్ గా చెప్పుకున్న డచ్ మోడల్ వెరా డిజ్క్‌మాన్స్ ను అమెరికాకు చెందిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఓ కార్యక్రమానికి హాజరుకావడానికి వెళ్తుండగా విమానంలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. వెరా డిజ్క్‌మాన్స్ ఈ ఘటనకు సంబంధించి వీడియోను విడుదల చేశారు. అదుపులోకి తీసుకున్న అనంతరం డెలానీ హాల్ నిర్బంధ కేంద్రం లో తనను బంధించినట్లు ఆమె తెలిపారు.ఐసీఈ అధికారులు తనను అపరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచారని, నాసిరకమైన ఆహారం పెడుతున్నారని వెరా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వెరా కుటుంబసభ్యులు స్పందిస్తూ.. ఆమెను ఎందుకు నిర్బంధించారనే విషయాన్ని కూడా అధికారులు వెల్లడించలేదని



చెప్పారు. ప్రస్తుతం ఆమె టూరిస్ట్ వీసాపై అమెరికాలో ఉందని తెలిపారు. అయితే డిజ్క్‌మాన్స్ ఇటీవల తన గ్రీన్ కార్డ్ దరఖాస్తు కోసం ఇమిగ్రేషన్ అధికారులు ఇచ్చిన అపాయింట్‌మెంట్‌కు హాజరుకాలేదని ఆమె తల్లి తెలిపారు. అందువల్లే ఆమెను అధికారులు బంధించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అమెరికాలోని డచ్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించినప్పటికీ తమకు సాయం అందలేదని వెరా తల్లి చెప్పారు. దీనిపై డచ్ రాయబార కార్యాలయ ప్రతినిధి మాట్లాడుతూ.. ఈ ఘటనపై నెదర్లాండ్స్ ప్రభుత్వానికి అవగాహన ఉందని, ఆమెకు తగిన సాయాన్ని అందించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గోప్యతా కారణాల దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేకపోతున్నామని తెలిపారు. అయితే టూరిస్ట్ వీసాపై అమెరికా వెళ్లినవారు అక్కడ డబ్బు సంపాదించే ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే రూల్ ఉంది. ఈ రూల్‌ను అతిక్రమించినందుకునే వెరాను అదుపులోకి తీసుకున్నారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, వెరా డిజ్క్‌మాన్స్‌కు ఇన్‌స్టాలో 60 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ క్రమంలో గత ఏడాది ఆమె ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తనకు 5,000 మంది నుంచి డేటింగ్ అప్లికేషన్‌లు వచ్చినట్లు చెప్పారు. తనను తాను 'ప్రపంచంలోనే మోస్ట్‌వాంటెడ్ గర్ల్‌ఫ్రెండ్' గా ప్రకటించుకున్నారు. దాంతో ఆమె వార్తల్లో నిలిచారు.

భారత్ లో భారీ పెట్టుబడులకు అమెజాన్ సై.

-భారత్‌లో రూ.58 వేల కోట్ల పైచిలుకు పెట్టుబడి

-కర్ణాటక మధ్యప్రదేశ్ రాజస్థాన్‌లలో నాలుగు భారీ ప్రాజెక్టుల ప్రకటన

-2 గిగావాట్లకు చేరనున్న అమెజాన్ హరిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం

-అమెజాన్ నిర్ణయాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

-2040 నాటికి నెట్ జీరో కర్బన ఉద్గారాలే లక్ష్యమన్న సంస్థ

న్యూఢిల్లీ నవంబర్ 17మహాప్రభ



భారత్‌లో పర్యావరణహిత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను విస్తరించేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఈ-కామర్స్, క్లౌడ్ సేవల దిగ్గజం అమెజాన్ భారీ ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి దేశంలో అదనంగా మరో 7 బిలియన్ డాలర్లను (సుమారు రూ.58 వేల కోట్లకు పైగా) గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే భారత్‌లో పునరుత్పాదక ఇంధన ఒప్పందాల కోసం 4 బిలియన్ డాలర్లను కేటాయించిన సంస్థ, తాజా నిర్ణయంతో తన విస్తరణను మరింత వేగవంతం చేయనుంది. తద్వారా దేశంలో కర్బన రహిత విద్యుత్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న కార్పొరేట్ సంస్థలలో ఒకటిగా అమెజాన్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పటికే కేటాయించిన 4 బిలియన్ డాలర్ల నిధుల్లో భాగంగా, మొత్తం 934 మెగావాట్ల (వీఐ) సంయుక్త సామర్థ్యంతో కూడిన నాలుగు సరికొత్త విండ్, సోలార్ ప్రాజెక్టులను అమెజాన్ ప్రకటించింది. వీటిలో కర్ణాటకలో 234 మెగావాట్ల భారీ విండ్ ప్రాజెక్ట్‌తో పాటు మరో 200 మెగావాట్ల హైబ్రిడ్ విండ్-సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయి. ఇందులో 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ ఆసియాలోనే అమెజాన్ చేపట్టిన అత్యంత భారీ పవన విద్యుత్ ఒప్పందం కావడం విశేషం. వీటితో పాటు మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు.

ఐపీఎల్ కు గుడ్ బై చెప్పిన ధోనీ..

–ఐపీఎల్ నుంచి ఆటగాడిగా తప్పుకున్న ఎంఎస్ ధోనీ
–సీఎస్‌కే మెంటార్‌గా సరికొత్త బాధ్యతలు
–రిలీజ్ లిస్టులో తన పేరు చేర్చండంటూ ధోనీ వ్యాఖ్య
–ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేమన్న శ్రీనివాసన్
–ఐదు ఐపీఎల్ ట్రోఫీలు అందించిన రికార్డు కెప్టెన్



న్యూఢిల్లీ:
క్రికెట్ ప్రపంచంలో ఒక అద్భుత శకం ముగిసింది. భారత మాజీ సారథి, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. ఆటగాడిగా మైదానాన్ని వీడినప్పటికీ, సీఎస్‌కేతో అతడి అనుబంధం కొనసాగనుంది. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు 'టీమ్ మెంటార్'గా సరికొత్త బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ధోనీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఎలా తెలియజేశాడో సీఎస్‌కే యజమాని రూపా గురునాథ్ ఒక ప్రత్యేక వీడియో ద్వారా పంచుకున్నారు. వచ్చే సీజన్ కోసం ఆటగాళ్ల విడుదల (రిలీజెస్), వ్యూహాలపై శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ పరిణామం చోటుచేసుకుంది. సీఎస్‌కే ఎండీ కాశీ విశ్వనాథన్ విడుదల చేయాల్సిన ఆటగాళ్ల జాబితాను చదువుతుండగా, ధోనీ చాలా నిశ్శబ్దంగా స్పందిస్తూ.. "బహుశా ఆ జాబితాలో నా పేరు కూడా చేరిస్తే మంచిదేమో" అని అన్నాడని రూపా గురునాథ్ వెల్లడించారు. ఆ మాట విన్న వెంటనే తామంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యామని, జట్టుకు 200 శాతం న్యాయం చేయలేనప్పుడు మైదానంలో కొనసాగడం ధోనీ నైజం కాదని ఆమె పేర్కొన్నారు. ఇకపై ధోనీ మెరుపు స్టంపింగ్స్, హెలికాప్టర్ షాట్లు మైదానంలో కనిపించవనే నిజాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉందని, అయితే కొత్త తరం ఆటగాళ్లకు మార్గదర్శనం చేసేందుకు మెంటార్‌గా ఆయన రాకను స్వాగతిస్తున్నామని చెప్పారు.సీఎస్‌కే అధినేత ఎన్ శ్రీనివాసన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ధోనీ గొప్పతనాన్ని కొనియాడారు. "ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేము. దాదాపు రెండు దశాబ్దాలుగా మేము కలిసి ఎదిగాం. 2008 ఐపీఎల్ వేలంలో ధోనీని కెప్టెన్‌గా ఎంపిక చేయడమే మా జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం. ట్రోఫీల కోసం మాత్రమే కాదు, అతడి వ్యక్తిత్వం పరంగా చూసినా ఆ నిర్ణయం చాలా గొప్పది. చెన్నై సూపర్ కింగ్స్ ఎప్పటికీ అతడి సొంత ఇల్లే" అని శ్రీనివాసన్ స్పష్టం చేశారు. సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సైతం ధోనీ సేవలను గుర్తు చేసుకున్నారు. చెన్నై నగరంతో, అభిమానులతో ధోనీ విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకున్నాడని తెలిపారు. ట్రోఫీలు గెలవడమే కాకుండా, వాటిని గెలిచిన విధానమే ధోనీ వారసత్వాన్ని ఉన్నతంగా నిలబెట్టిందని, మెంటార్‌గా అతడు ఇచ్చే సలహాలు భవిష్యత్ తరానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు ప్రస్తావన ఏదీ?

(మొదటి తరువాయి)

తాజాగా సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ చరిత్రను గుర్తు చేస్తూ కాంగ్రెస్ వాదనలను ప్రశ్నించారు. ఇదే సందర్భంగా తెలంగాణ ఉద్యమ కాలం నాటి తన పాదయాత్ర జ్ఞాపకాలను కేటీఆర్ పంచుకున్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాటు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఆ యాత్రకు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా సాగిన ఆ పాదయాత్ర తన జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ జ్ఞాపకాలను ప్రస్తావిస్తూనే తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ వైఖరిపై విమర్శలు సంధించారు.

భారత్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో కీలక మార్పులు..ఆ కంటెంట్‌కు చెక్!



న్యూఢిల్లీ:
సామాజిక మాధ్యమ వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో భారతీయ వినియోగదారుల కోసం మెటా కీలక మార్పులు చేపట్టింది. అశ్లీల, హింసాత్మక కంటెంట్ సిఫార్సులను తగ్గించేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ సూచనల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. వినియోగదారులు అనుసరించని ఖాతాల నుంచి వచ్చే అభ్యంతరకర పోస్టులు వారి ప్రధాన తెరపై కనిపించకుండా సిఫార్సుల వ్యవస్థలో మార్పులు చేసింది. ఈ విధానంలో భాగంగా భారత్‌కు అనుగుణంగా ప్రత్యేక కృత్రిమ మేధ నమూనాలను అభివృద్ధి చేసినట్లు మెటా వెల్లడించింది. వినియోగదారులు ఫిర్యాదు చేసే వరకు వేచి చూడకుండా అశ్లీల, హింసాత్మక అంశాలను గుర్తించి వాటి వ్యాప్తిని అడ్డుకునేలా ఈ వ్యవస్థ పనిచేస్తుందని తెలిపింది. అయితే ఆయా పోస్టులపై పూర్తిస్థాయి నిషేధం విధించకుండా, ఇతరులకు సిఫార్సు చేయకుండా మాత్రమే నియంత్రణలు చేపడుతున్నట్లు వివరించింది. కొత్త విధానం అమలుతో గత ఏడాదితో పోలిస్తే సిఫార్సు చేసిన కంటెంట్‌పై వినియోగదారుల ఫిర్యాదులు దాదాపు సగానికి తగ్గాయని మెటా పేర్కొంది. దీనికి సంబంధించిన కచ్చితమైన గణాంకాలను మాత్రం వెల్లడించలేదు. వినియోగదారులు ఏదైనా పోస్టును 'నాట్ ఇంట్రెస్టెడ్'గా గుర్తిస్తే, ఆ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తు సిఫార్సులను మెరుగుపరుస్తామని తెలిపింది. గత అక్టోబరు 10న కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మెటాకు కీలక సూచనలు చేసింది. తప్పుదోవ పట్టించే, పక్షపాత ధోరణితో కూడిన కంటెంట్ వ్యాప్తిని అరికట్టాలని, సిఫార్సుల విధానాన్ని సమీక్షించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే మెటా తాజా మార్పులు చేపట్టినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.వినియోగదారులు తమకు ఎలాంటి కంటెంట్ కనిపించాలో నిర్ణయించుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్ మరిన్ని నియంత్రణలను అందుబాటులో ఉంచింది. సున్నితమైన కంటెంట్ నియంత్రణ, రాజకీయ అంశాల నియంత్రణ, దాచిన పదాల ఎంపిక, ఖాతాలను నిరోధించడం వంటి సదుపాయాల ద్వారా నచ్చని పోస్టులను పరిమితం చేసుకోవచ్చు..

కొత్త పింఛనుదారులకు శుభవార్త

(మొదటి తరువాయి)

చొప్పున అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,63,857 మందికి కొత్తగా సామాజిక భద్రతా పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో 2,77,894 మంది వితంతువులు, 1,00,224 మంది దివ్యాంగులు, 53,844 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. వీరితోపాటు గీత, చేనేత కార్మికులకు కూడా పింఛన్లు మంజూరు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు నగదు బదిలీ చేసేందుకు ఆర్థిక శాఖ ఇప్పటికే నిధులు విడుదల చేసింది. పింఛన్ల పంపిణీకి సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 40.44 లక్షల మంది సామాజిక భద్రతా పింఛన్లు పొందుతున్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో ఈ సంఖ్య సుమారు 45 లక్షలకు చేరనుంది. దీంతో మరింత మంది అర్హులకు సామాజిక భద్రత కల్పించినట్లవుతుంది. ఇదిలా ఉండగా, భవిష్యత్తులో పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ పెంపుపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం కొత్తగా పింఛన్లు పొందుతున్న వారికి ఈ నెల 19న తొలి విడతగా రూ.2 వేల చొప్పున అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

మోదీ చాలా 'టఫ్ మ్యాన్'..

-క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు
-మనీలాలో జరిగిన క్వాడ్ సదస్సులో మోదీని 'గట్టి వాడు'గా అభివర్ణించిన ట్రంప్
-క్వాడ్ సమావేశంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతల చర్చలు
-85 మిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ యాక్సిలరేటర్ ప్రారంభమిస్తామన్న ట్రంప్
-సముద్ర జలాల రక్షణ కోసం 4 దేశాల సైన్యాలతో ఉమ్మడి మిలిటరీ విన్యాసాలు
-అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో భారత్, జపాన్ భాగస్వామ్యాన్ని కొనియాడిన ట్రంప్



న్యూఢిల్లీ:
ఫిలిప్పీన్స్‌లోని మనీలా వేదికగా జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత, ఆసియాన్ సదస్సు సందర్భంగా జరిగిన ఈ భేటీలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని 'టఫ్ మ్యాన్' (చాలా గట్టి వాడు)గా అభివర్ణించారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై మోదీ 'టఫ్ నెగోషియేటర్', తనకంటే చాలా బెటర్ అని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. భవిష్యత్ సాంకేతికతకు దిశానిర్దేశం చేసేందుకు 85 మిలియన్ డాలర్ల నిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్సిలరేటర్'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సముద్ర జలాల్లో నియంత్రణ సామర్థ్యాలను పెంచేందుకు నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ (అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిని పెంచడంలో అమెరికాతో పాటు భారత్, జపాన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాబోయే 10 నెలల్లో తమకు అవసరమైన అన్ని వనరులు సమకూరుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. చైనా పర్యటనలో భాగంగా జిన్‌పింగ్, పుతిన్‌లతో త్రైపాక్షిక అణు చర్చలు జరిపి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తానని ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అవకాశం ఉందని, ఇరాన్ అణ్వాయుధాలు సాధించకుండా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. మరోవైపు, ఎన్విడియా జాతీయ భద్రతా ప్రతిపాదనను స్వాగతిస్తూనే, ఇటీవల రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపడితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

సమ్మక్క సాగర్‌కు ఎన్ఓసీ ఇవ్వండి

-ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
-రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ
-సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూల స్పందన
-తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం
-నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం



హైదరాబాద్:
ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి వెంటనే నిరభ్యంతర పత్రం జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాయ్‌పూర్‌లో ఆయనతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు వివరాలను వివరించి, ఎన్ఓసీతోపాటు మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో గోదావరి జలాలను నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని తెలిపారు. నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనుమతులు త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తొలుత కాంతనపల్లి వద్ద ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. దీంతో 17 ఆదివాసీ గ్రామాలతోపాటు భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఈ ప్రాంతంలో నిర్మాణం చేపట్టడం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనంలో తేలింది. భారీ వరదలు వచ్చినప్పటికీ ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదని నివేదిక పేర్కొంది. ప్రాజెక్టు అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే రూ.9.883 కోట్లు చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన అధ్యయన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ వివరాలను కూడా సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్ఓసీతోపాటు ఇతర అనుమతులను త్వరగా మంజూరు చేస్తే ప్రాజెక్టు ద్వారా గిరిజన, వెనుకబడిన ప్రాంతాలకు సాగు, తాగునీటి ప్రయోజనాలు అందుతాయని వివరించారు.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు



న్యూఢిల్లీ:
భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా–ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు.భారత్, ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మన భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్–ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'మన భవిష్యత్తును కలిసి నిర్మించుకుందాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

అభయ హస్తం కాదు.. మొండి హస్తం!

(మొదటి తరువాయి)

మూడేళ్ల క్రితం ఇదే రోజున మల్లికార్జున ఖర్గే సమక్షంలో రేవంత్‌రెడ్డి మేనిఫెస్టో అమలుపై హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గాంధీభవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. ఖర్గే, రేవంత్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి కేబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటివరకు 38 కేబినెట్ సమావేశాలు జరిగినా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని నిలదీశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చాక వాటి అమలును విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజల ఆశలను ఓట్లుగా మలుచుకున్న కాంగ్రెస్.. అధికారం చేపట్టాక హామీలను పక్కనపెట్టిందని విమర్శించారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే పార్టీ.. గాంధీభవన్ వేదికగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మూడేళ్లుగా ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనతగా అభివర్ణించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

వాషింగ్టన్‌ను వణికిస్తున్న ఇరాన్ మాస్టర్ ప్లాన్!



న్యూఢిల్లీ:
వాషింగ్టన్‌లోని ట్రంప్ ప్రభుత్వ అగ్రశ్రేణి అధికారులను లక్ష్యంగా చేసుకుని రసాయన దాడి లేదా 'డర్టీ బాంబ్' పేల్చేందుకు ఇరాన్ వ్యూహం రచిస్తోందని అమెరికా భావిస్తోంది. ఈ విషయం ఇప్పుడు అగ్రరాజ్యాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. యూఎస్ ఇంటెలిజెన్స్ తాజా నివేదికల ఆధారంగా సీఎన్ఎన్ ఈ సంచలన కథనాన్ని వెల్లడించింది. దాడులు చేయాలనుకుంటున్న నిర్దిష్ట ప్రాంతాలు, లక్ష్యాలకు సంబంధించిన వివరాలు తమ నిఘా వర్గాలకు లభించినట్లు అమెరికా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా రక్షణ విభాగాలు తమ భద్రతా చర్యలను ముమ్మరం చేశాయి. ప్రస్తుతం స్వదేశానికి ఎటువంటి ప్రమాదం లేదని, పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని వైట్‌హౌస్ ప్రతినిధి లారెన్ బిస్ వెల్లడించారు. ఇటీవల 123 మంది చిన్నారులు మరణించిన మినాబ్ పాఠశాల దాడికి బాధ్యులుగా పేర్కొంటూ ఇద్దరు యూఎస్ నేవీ అధికారులకు ఇరాన్ నేరుగా హెచ్చరికలు జారీ చేసింది. ఆ వెంటనే అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్‌ను ఆయన నివాసం నుంచి సురక్షితమైన మిలిటరీ స్థావరానికి తరలించారు. హర్మూజ్ జలసంధి దిగ్బంధనం, యుద్ధం వల్ల తలెత్తిన ఆర్థిక ఒత్తిళ్ల నడుమ, అమెరికా గడ్డపైనే దాడులు చేయడానికి టెహ్రాన్ పథకాలు రచిస్తోందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి.అణ్వాయుధం మాదిరిగా విచ్ఛిత్తి (ఫిషన్) జరగకపోయినా, సంప్రదాయ పేలుడు పదార్థాలతో రేడియోధార్మిక లేదా రసాయన పదార్థాలను కలిపి 'డర్టీ బాంబ్' తయారు చేస్తారు. దీనివల్ల విస్తారమైన ప్రాంతంలో ప్రమాదకర రసాయనాలు వ్యాపించి ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది.

షాంఘై భేటీకి పాక్‌కు ఆహ్వానమా?

న్యూఢిల్లీ:
పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్–పాకిస్థాన్ సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతకు లోనైన నేపథ్యంలో.. తాజాగా షాంఘై సహకార సంస్థ సదస్సుకు పాకిస్థాన్‌ను ఆహ్వానించడంపై రాజకీయ వివాదం మొదలైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ వైఖరిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే విధానాన్ని విడిచిపెట్టిందా? అని ప్రశ్నించింది. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ ఈ అంశంపై స్పందిస్తూ.. పహల్గాంలోని బైసారన్ లోయలో పర్యాటకులను మతం ఆధారంగా లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు హతమార్చిన ఘటన తర్వాత ఏం మారిందని నిలదీశారు. పాకిస్థాన్ తన తప్పును అంగీకరించిందా? ఉగ్రవాద మౌలిక వ్యవస్థపై చర్యలు తీసుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ సైతం కేంద్ర ప్రభుత్వ విధానంపై విమర్శలు చేశారు. పాకిస్థాన్ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి ఏమిటో స్పష్టంగా తెలియడం లేదని వ్యాఖ్యానించారు. ఈ నెల 20 నుంచి 22 వరకు ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో షాంఘై సహకార సంస్థ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి సభ్యదేశాలన్నింటికీ భారత్ ఆహ్వానాలు పంపింది.

సంపాదకీయం

యుపిలో ప్రధాన పార్టీల మల్లగుల్లాలు



కమల నాథులకు జవసత్వాలు అందిస్తున్న రాష్ట్రాల్లో అతి ముఖ్యమైన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో జరగనున్నాయి. అయితే రాష్ట్రం లోని ప్రధాన రాజకీయ పక్షాలు ప్రస్తుతం తీవ్రమైన అంతర్గత విభేదాలతో సతమతమవుతున్నాయి. ఈ అంతర్గత కలహాలు ఆయా పార్టీల ఎన్నికల విజయావకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని పసిగట్టిన బిజెపి సోమవారం నుంచి రెండు రోజుల పాటు మేధోమథన సమావేశాలను నిర్వహిస్తోంది. పార్టీ బలాలు, బలహీనతలు ఈ సమావేశాల్లో సమీక్షించనున్నారు. ఉత్తరప్రదేశ్ రాజకీయ పరిస్థితులు, భౌగోళిక , రాజకీయ పరిణామాలపై పూర్తి అవగాహన ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత కొన్ని నెలలుగా తరచూ ఈ రాష్ట్రాన్ని సందర్శిస్తూ ఈ ఎన్నికల్లో తమ పార్టీ మూడోసారి హ్యాట్రిక్ సాధించడానికి వ్యూహాలను రూపొందిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బిజెపి ఆర్ఎస్ఎస్‌కు మధ్య సరైన సమన్వయం లోపించడంతో బిజెపి తీవ్ర నష్టం జరిగింది. ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఆర్ఎస్ఎస్ మద్దతుతో పోలింగ్ బూత్ స్థాయిలో కూడా సమన్వయం ఉండేలా పర్యవేక్షణ చేపట్టాయి. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర కార్యకర్తల్లో క్షేత్రస్థాయిలో నిర్లిప్తత, అలసత్వం నెలకొంది. పార్టీకి మొదటి నుంచి విధేయంగా పనిచేస్తున్న కార్యకర్తలను పక్కనపెట్టి కొత్తవారికి పార్టీలో ప్రాధాన్యం ఇస్తున్నారన్న అసంతృప్తి ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు స్థానిక నాయకుల్లో విభేదాలు నెలకొన్నాయి. ఇటీవల వెలువడిన శాసనమండలి ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే మొత్తం 11స్థానాల్లో బిజెపికి ఆరు, సమాజ్‌వాదీ పార్టీకి ఐదు స్థానాలు కైవసం కావడంతో సమాజ్‌వాదీ పార్టీకి కొత్త బలం వచ్చింది. ఇప్పటికీ ఆ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది.అయితే సమాజ్‌వాదీ పార్టీకి మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ మాత్రం, సమాజ్‌వాదీ పార్టీకి ఇవ్వాల్సిన సీట్ల విషయంలో ఏమాత్రం తగ్గడానికి సిద్ధంగా లేదు. మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో తాము 189 నుంచి 200 స్థానాల్లో పోటీ చేస్తామని డిమాండ్ చేస్తోంది. దీంతో ఇండియా కూటమిలో పార్టీల మధ్య సీట్ల పంపకంలో విభేదాలు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పర అవగాహనతో కలిసి పోటీ చేసి మంచి ఫలితాలను సాధించాయి. 2022లో కాంగ్రెస్ పోటీ చేసిన 399 స్థానాల్లో కేవలం 2.33 శాతం ఓట్లను మాత్రమే సాధించగలిగింది. అదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ తాను పోటీ చేసిన 347 స్థానాల్లో 111 స్థానాలను గెలుచుకుని 32% ఓట్లను సాధించింది. అలాంటప్పుడు కాంగ్రెస్ 181 నుంచి 200 వరకు స్థానాలను కోరడం వాస్తవానికి మించిన అత్యాశే అవుతుందన్న విమర్శ వస్తోంది. అయితే అప్పటి నుంచి రాజకీయ పరిస్థితుల్లో అనేక మార్పులు వచ్చాయని కాంగ్రెస్ చెప్పడంలో కూడా కొంత వాస్తవం ఉంది దేశంలోని యువత సమస్యలపై, ఎన్నికల ప్రజాస్వామ్యంపై తాము నిర్వహిస్తున్న ఆందోళనలే తమకు ప్రజల్లో పాప్యులారిటీని తెస్తోందని కాంగ్రెస్ విశ్వసిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమిని బలహీనపర్చకుండా, తమకంటే బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలతో సీట్ల పంపకాల విషయంలో తమకు అనుకూలమైన ఒప్పందాన్ని ఎలా కుదుర్చుకోవాలన్నది కాంగ్రెస్ ఎదుర్కొంటున్న తాజా సమస్య. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో గతంలో కాంగ్రెస్‌కు బలమైన పట్టు ఉన్న రాష్ట్రాల్లో తిరిగి తన బలాన్ని పెంచుకోవడానికి కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ప్రతిపక్ష ఐక్యతకు ఆటంకం కలిగిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. బిజెపిపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నప్పటికీ భారత రాజకీయ వ్యవస్థలో బిజెపి ఇప్పటికీ బలమైన ఆధిపత్య స్థానంలో ఉంది. బిజెపిని ఎదుర్కోవడానికి బలమైన కూటమి తప్పనిసరి. అలాగే ప్రజలను ఆకట్టుకునే ఒకే ఒక్క ఉమ్మడి సందేశంతో ముందుకు వెళ్లడం తప్ప మరోమార్గం లేదని ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తున్నాయి.గతంలో బీహార్‌లో జెడియూ బిజెపి కూటమిపై ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత ప్రయోజనాన్ని మహాగఠ్‌బంధన్ పూర్తిగా పొందలేకపోయింది. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలకు మద్దతుగా ఉన్న వివిధ సామాజిక వర్గాల పూర్తి మద్దతును మహాగఠ్ బంధన్ తనవైపు తిప్పుకోలేకపోయింది. అలాగే సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్ చాలా ఆలస్యం చేసింది. తమిళనాడులో డిఎంకె నుంచి ఎక్కువ సీట్లు కావాలని కాంగ్రెస్ పట్టుపట్టడంతో కూటమి ఒప్పందం ఆలస్యమైంది. పార్టీలోని అంతర్గత విభేదాల వల్ల ఆశించిన స్థాయిలో ప్రచారం జరగలేదు. ఫలితంగా కూటమి లోని ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్ తాను పోటీ చేసిన స్థానాల్లో అత్యల్ప ఓటు శాతాన్ని సాధించింది. తమిళనాడులో ఎక్కువ సీట్ల కోసం పట్టుబట్టినట్టు ఉత్తరప్రదేశ్‌లో పట్టింపులకు పోకుండా కూటమి ఐక్యతను నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు అవసరం. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా బలమైన సమర్థవంతమైన పార్టీ సంస్థాగత నిర్మాణం కాంగ్రెస్‌కు లేకపోవడం సమస్యగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల బలాబలాలను దృష్టిలో పెట్టుకుని వాస్తవ పరిస్థితుల ఆధారంగా సీట్లను కోరాలని ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు అభిప్రాయపడుతున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటికీ అత్యంత బలమైన ప్రతిపక్ష పార్టీగా కొనసాగుతోంది. వెనుకబడిన తరగతులు, దళితులు, మైనార్టీలను కలుపుకుని ఒక కొత్త సామాజిక కూటమిని ఏర్పాటు చేయడంలో ఆ పార్టీ గట్టిగా కృషి చేసింది. సుమారు 100 స్థానాలను లక్షంగా చేసుకుని వ్యూహాత్మకంగా పోటీ చేయడం మరింత వాస్తవికమైన ఆలోచన అవుతుంది. మరోవైపు ప్రతిపక్ష కూటమి ఎఐఎంఐఎం పార్టీ ఎన్నికల్లో పోటీకి రంగంలోకి దిగుతుండడం కొసమెరుపు. ఈ నేపథ్యంలో కూటమి సమష్టిగా లేకుంటే ఓట్లు చీలిపోతాయన్న వాదన వినిపిస్తోంది

గోమాత సేవలోనే జీవకారుణ్యం..
ప్రకృతి పరిరక్షణకు పశుసంపదే ప్రాణాధారం

-గోపాష్టమి వేడుకల్లో శ్రీవాణి శిశుమందిర్ విద్యార్థులకు గోవు విశిష్టతపై అవగాహన





దేవరకద్ర, నవంబర్ 17మహాప్రభ (మహబూబ్‌నగర్ జిల్లా):
భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో గోమాతకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. గోవును కేవలం పశువుగా కాకుండా సకల దేవతల నిలయంగా భావిస్తూ పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ పవిత్ర సంప్రదాయాన్ని భావితరాలకు పరిచయం చేస్తూ గోమాత పట్ల భక్తిభావం, జీవకారుణ్యం, పశుసంపద పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం నింపేలా దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీవాణి శిశుమందిర్ పాఠశాలలో గోపాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తితో పూజించి గోపూజ ప్రాధాన్యతను చాటిచెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు గోపాష్టమి పండుగ విశిష్టతను, గోవు యొక్క ఆధ్యాత్మిక, సామాజిక, పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు గోవులను మేపుతూ గోపాలుడిగా ప్రసిద్ధి పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ గోపాష్టమిని జరుపుకుంటారని తెలిపారు. గోవుల సంరక్షణ, గోసేవ, పశుసంపద అభివృద్ధికి ఈ పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. గోవు నుంచి లభించే పాలు, పేడ, మూత్రం వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో పశుసంపద పాత్ర ఎంతో కీలకమని, సకల జీవరాశుల పట్ల దయ, కరుణ కలిగి ఉండటమే నిజమైన మానవత్వమని విద్యార్థులకు బోధించారు.
ఒకప్పుడు ప్రతి గ్రామంలోనూ పశుసంపద కళకళలాడేదని, వ్యవసాయానికి గోవులు వెన్నెముకగా నిలిచేవని ఉపాధ్యాయులు గుర్తుచేశారు. అయితే ఆధునిక కాలంలో పశుసంపద తగ్గిపోవడం, గోవుల సంరక్షణకు తగిన ప్రాధాన్యత లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. గోవుల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. పుస్తకాల్లో చదివే విలువలకే పరిమితం కాకుండా, ఆచరణలోనూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జీవకారుణ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా శ్రీవాణి శిశు మందిర్ పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేకతను చాటుకుంది. చిన్ననాటి నుంచే ప్రకృతి ప్రేమ, మూగజీవాల పట్ల దయ, సంస్కృతి పట్ల గౌరవం అలవర్చుకోవాలనే సందేశాన్ని ఈ గోపూజ కార్యక్రమం విద్యార్థులకు అందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అన్నగా ఉంటూ.. అందరి రుణం తీర్చుకుంటూ!!

-పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు..!!
-కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పారదర్శక పాలన..!!
-వనపర్తి నియోజకవర్గానికి నాలుగు కొత్త సింగిల్ విండోలు మంజూరు.!!.



వనపర్తి నవంబర్ 17 మహాప్రభ
ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ వారి రుణం తీర్చుకుంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.బి పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు, చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో సూర్యుడి లభిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి నడిపించును కార్డులు రేషన్ కార్డులు అందుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు వంటి పథకాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. అదేవిధంగా ఇందిరా బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. నాలుగు కొత్త సింగిల్!విండోలకు మంజూరు వనపర్తి నియోజకవర్గ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సోలిపూర్, వెల్టూరు, రేవల్లి, ఏదుల ప్రాంతాలకు కొత్త సింగిల్ విండోలు మంజూరు అయ్యాయన్నారు వీటి ద్వారా రైతులకు వ్యవసాయ సేవలు మరింత చేరువ కావడానికి ఈ సొసైటీలు దోహదపడతాయని అన్నారు త్వరలోనే పెద్దగూడెం, కడుకుంట్ల, గుమ్మడం, అయ్యవారిపల్లి గ్రామాలకు కూడా సింగిల్ విండోలు మంజూరు అవుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు కొన్ని సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన పెద్దమందడి రోడ్డు పనులను త్వరితగతిన తిరిగి ప్రారంభించి పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయడమే తన ప్రాధాన్యత అని తెలిపారు ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలో ప్రతినెల రూ.11 కోట్ల పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు 5,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తద్వారా గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేరింది అని పేర్కొన్నారు నాడు ఎన్టీ రామారావు కాలం నుంచి నేడు రేవంత్ రెడ్డి వరకు ప్రభుత్వాలు చేపట్టిన ముఖ్యమైన పథకాలను కొనసాగిస్తూనే రేవంత్ రెడ్డి పాలనలో ఇందిరమ్మ సర్కార్ ఉత్త పథకాలను సైతం నిరుపేదలకు అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు పెద్దమందడి మండల పరిధిలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో ఖిల్లా గణపురం, పెద్దమందడి వ్యవసాయ మార్కెట్ యార్డుల అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గంగా రవీందర్, మండలాధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సింగిల్ ఉండు అధ్యక్షులు సత్యారెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మనిగిల్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో, ఎతీశీ, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

అయ్యప్ప స్వామి ఆలయానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి

-ఎమ్మెల్యేకు అయ్యప్ప సేవా సమితి సభ్యులు వినతి పత్రం అందజేత



చింతపల్లి,
నవంబర్ 17(మహాప్రభ)
మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కల్పించి, నీటి సమస్యను పరిష్కరించాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు దేవరకొండ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రంలో సుమారు ఏడు సంవత్సరాల క్రితం శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానాన్ని నిర్మించామని, ప్రతి ఏడాది వంద మందికి పైగా అయ్యప్ప స్వాములు ఇక్కడ దీక్షలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే ఆలయంలో నీటి సౌకర్యం లేకపోవడంతో స్వాములు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి అవసరాల కోసం ఇప్పటికే రెండు బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ చుక్క నీరు కూడా రాకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారిందన్నారు. స్వాముల నిత్య స్నానాలు, పూజా కార్యక్రమాలు, అన్నదాన ఏర్పాట్లకు అవసరమైన నీటిని గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా, ప్రైవేటు వ్యక్తుల నుంచి డబ్బులు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని వివరించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధానానికి మిషన్ భగీరథ నీటి సరఫరా సౌకర్యం కల్పించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు. భక్తుల సౌకర్యార్థం నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మాజీ సర్పంచ్ పుచ్చల యాదగిరి, అయ్యప్ప గురు స్వాములు చెనమోని రాములు, గోవిందు యాదగిరి, వెన్నం శేఖర్, భోగరాజు మధుసూదన్, చెట్లపల్లి ప్రసాద్, పసుపుల జగన్, గూడెల్లి కోటేష్, ఎలిమినేరి నరసింహ్మ, కాసారపు శ్రీనివాస్, కొడిదాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛను పత్రాలు అందజేత



పాపన్నపేట నవంబర్17(మహాప్రభ)
పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట లోని ఓ ఫంక్షన్ హాల్ లో వివిధ గ్రామాల చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్,డిఎల్ పిఓ యాదయ్య,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

కార్తీకమాసోత్సవం సందర్భంగా ఆకాశదీపోత్సవం



మిడ్జిల్, నవంబర్ 17(మహాప్రభ)
మిడ్జిల్ మల్లె కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు స్వామివారి సన్నిధిలో ఆకాశదీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి షోడశోపచార పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు.ఆకాశదీప పూజా కైంకర్యాలను మిడిదొడ్డి విజయ్ కుమార్, వరలక్ష్మి దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కృపాకటాక్షాలు విజయ్ కుమార్, వరలక్ష్మి దంపతులపై సంపూర్ణంగా ఉండాలని, వారికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, లక్ష్మీ సౌభాగ్యాలు ప్రసాదించాలని ఆలయ అర్చకులు ప్రార్థించారు.

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- డా. కొర్ర కిషన్ నాయక్

-దేవరకొండలో ఘనంగా సన్మానించిన ఆర్టీఐ, కాంగ్రెస్ నాయకులు



దేవరకొండ నవంబర్ 17(మహాప్రభ)

సమాచార హక్కు చట్టం--2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నల్గొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్టివిస్ట్ సొసైటీ (ఆర్.టి ఐ.ఎ.ఎస్.) రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. దేవరకొండ పట్టణంలోని స్థానిక ఐబీలో డా. కొర్ర కిషన్ నాయక్‌ను సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేతావత్ రమేష్ నాయక్, డిండి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇస్లావత్ రమేష్ నాయక్ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం--2005 ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు రూపొందించిన కీలకమైన చట్టమని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చట్టబద్ధంగా పొందేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్ట నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కోరారు. ముఖ్యంగా ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలకు సంబంధించిన ప్రజా ప్రయోజన సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించాలని, సంబంధిత సమాచారాన్ని నోటీసు బోర్డులు, అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనివల్ల ప్రజలు చిన్నచిన్న సమాచార అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తగ్గుతుందని వివరించారు. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరగడంతో పాటు అవినీతిని అరికట్టేందుకు, ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు చట్టంలోని నిబంధనలను బాధ్యతాయుతంగా పాటిస్తూ ప్రజలకు సకాలంలో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేతావత్ రమేష్ నాయక్, డిండి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇస్లావత్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి నేనావత్ కిషన్ నాయక్ 50,000/- ఆర్థిక సహాయం



దేవరకొండ నవంబర్ 17(మహాప్రభ)

పేద ప్రజలకు అండగా నిలుస్తూ, సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న బి.ఆర్.ఎస్. పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. దేవరకొండ మండలం, కర్నాటిపల్లి గ్రామానికి చెందిన జాజాల బుచ్చయ్య కుమార్తె పూజ వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కిషన్ నాయక్ 50,000 (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు:

నల్లమాద తిరుపతి రెడ్డి, నేనావత్ రమేష్ నాయక్,ఆంగోత్ సంతోష్ నాయక్,చిత్రం రమేష్, కొర్ర నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ మున్సిఫ్ కోర్టు పనులను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

-త్వరలో కోర్టు ప్రారంభోత్సవం..

-ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు





తూప్రాన్, నవంబర్ 17,(మహాప్రభ)

తూప్రాన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మున్సిఫ్ కోర్టు ప్రారంభానికి సర్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ కోర్టు భవనాన్ని సందర్శించి నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు, ప్రారంభోత్సవ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

కోర్టు భవనంలో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోరుబావిని, నీటి సరఫరా ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు హాలులోని ఫర్నిచర్‌ను పరిశీలించి, వాటిని అవసరానికి అనుగుణంగా క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవిధంగా భవనం వెనుక భాగంలో వాహనాల పార్కింగ్ కోసం టిన్‌షెడ్ నిర్మించాలని, కోర్టు ప్రాంగణం చుట్టూ పచ్చని మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. జడ్జి విశ్రాంతి గది, స్టెనో గది, సర్వర్ గది, సిబ్బంది గది, న్యాయవాదుల బార్‌రూమ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గదులను పరిశీలించారు. కోర్టు ప్రధాన గేటుపై నామఫలకం ఏర్పాటు చేయడంతోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించనున్న సమావేశానికి సంబంధించి సమీకృత మండల కార్యాలయాల ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసే ముఖ్య అతిథుల విడిది, విశ్రాంతి ఏర్పాట్ల కోసం ప్రభుత్వ అతిథి గృహాన్ని కూడా సందర్శించి పరిశీలించారు.తూప్రాన్‌లో మున్సిఫ్ కోర్టు ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమతో పాటు సూపరింటెండెంట్ మొయినుద్దీన్, డీఎస్పీ నరేందర్ గౌడ్, ఆర్డీవో భవయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, ఎస్ఐ గంగరాజు, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ఎం. అశోక్, వేణుగోపాల్ చారి తోపాటు పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ జిల్లా గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా స్టేషన్ శీను, ప్రధాన కార్యదర్శిగా గోమారం కుంట లక్ష్మణ్



తూప్రాన్ నవంబర్,17(మహాప్రభ)

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో గంగపుత్ర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గంగపుత్ర సంఘాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై సంఘం అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు దిటీ మల్లయ్య ఆధ్వర్యంలో మెదక్ జిల్లా గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

జిల్లా గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గం:
అధ్యక్షుడు: స్టేషన్ శీను
ప్రధాన కార్యదర్శి: గోమారం కుంట లక్ష్మణ్
వర్కింగ్ ప్రెసిడెంట్: బండారి గంగాధర్
ఉపాధ్యక్షులు: కామని నాగేష్, గరిగే నర్సింగరావు, కొత్తల సిద్ధిరాములు
కార్యదర్శి: మంగినపల్లి బాలరాజ్, చింతకింది ఏసు
మీడియా ప్రతినిధులు: పంపరి స్వామి, శివ (నిజాంపేట)
అధికార ప్రతినిధి: పెంటం పరమేశ్వర్
చీఫ్ అడ్వైజర్: కొత్తొల్ల సాయిలు
జిల్లా యూత్ గంగపుత్ర సంఘం కార్యవర్గం:
అధ్యక్షుడు: కుంట నాగేష్
ఉపాధ్యక్షుడు: కట్లె రమేష్
కోశాధికారి: గరిగే రవితేజ
కార్యదర్శి: ఏరువా అరవింద్
యూత్ ఉపాధ్యక్షుడు: ఏరువా శివశంకర్

ఈ కార్యక్రమంలో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం రాజకుమార్, రాష్ట్ర నాయకులు కాపర్తి మోహన్ కృష్ణ, పాకం మధుసూదన్, మెదక్ జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గడప దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు. గంగపుత్ర సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

గ్రామ గ్రామాన సంక్షేమ పథకాల పండుగ..

-పింఛన్ రేషన్ కార్డుల జాతర

-పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా

-వనపర్తి నియోజకవర్గంలో నెలకు రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ..

-గోపాలపేట, ఏదుల, రేవల్లి మండలాల్లో దాదాపు 1,100 మందికి కొత్త పింఛన్లు..

-ఇందిరమ్మ బీమాతో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ..





వనపర్తి నవంబర్ 17 మహాప్రభ

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కరువు ఛాయలు..

రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణ..

కరువు ఉందని అధైర్యపడొద్దు.. రైతులు, పేదలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేద కుటుంబాలకు సంక్షేమ భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామ గ్రామాన పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం గోపాలపేట మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో గోపాలపేట, ఏదుల మండలాలకు చెందిన లబ్ధిదారులకు 0 జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో కలిసి నూతన పింఛన్ మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారుఅనంతరం రేవల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ మూడు మండలాల పరిధిలో దాదాపు 1,100 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు రూ.11 కోట్ల పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ బీమా ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని, రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. కరువు పరిస్థితులు ఉన్నాయని రైతులు, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారిని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువు అని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం నుంచి నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరకు గత ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. పేదల సంక్షేమం, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు సత్యశీలారెడ్డి, ఏదుల మండల అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, రేవల్లి మండలాధ్యక్షు సుల్తాన్, జిల్లా నాయకులు వాడల పర్వతాలు, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, ఆయా గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గిరిజన తండా నుంచి జాతీయ స్థాయి వాలీబాల్ కు రాంచరణ్!



గాంధారి నవంబర్ 17 (మహాప్రభ)

గాంధారి మండలం పేట్ సంగం పరిధిలోని గుడివెనుక తండాకు చెందిన మూడ్ రాంచరణ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. పేట్ సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాంచరణ్, కోచ్ లక్ష్మణ్ రాథోడ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందు తున్నాడు. ఈ నెల 13 నుండి 15 వరకు సంగారెడ్డి జిల్లా దౌలతాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -14 ఎస్.జి.ఎఫ్. పోటీలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో రాం చరణ్ కీలక పాత్ర పోషించాడు. ఈ నెల 23 నుండి 28 వరకు మహారాష్ట్రలోని షిరిడీలో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో తెలంగాణ జట్టు తరఫున రాంచరణ్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాంచరణ్ కు ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ లు, యువకులు, క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

కబ్రస్తాన్‌కు రూ. 30 లక్షలు మంజూరు

-ఎమ్మెల్యే మదన్ మోహన్ కు మైనారిటీ సోదరుల సన్మానం



గాంధారి నవంబర్ 17 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని కబ్రస్తాన్ అభివృద్ధికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రూ. 30 లక్షలు మంజూరు చేశారు. కబ్రస్తాన్ బౌండరీ వాల్ కు రూ. 20 లక్షలు, కమిటీ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మైనారిటీ సోదరులు, కాంగ్రెస్ కార్యకర్తలు దర్గాలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ మసీద్ సదర్ బాబు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ మండల అధ్యక్షుడు హైమద్, టౌన్ ప్రెసిడెంట్ పర్వేజ్, రహమత్, మైనారిటీ క్యాషియర్ మోయిస్, ఇంజనీరింగ్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మదర్ బాయ్, ఇతర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్ గాంధారి విద్యార్థుల ఘనత

రాష్ట్రపతిని కలిసిన నవీన్, సంతోష్.. కలెక్టర్ ప్రశంస



గాంధారి నవంబర్ 17 (మహాప్రభ)
ఈఎంఆర్ఎస్ గాంధారి పాఠశాల విద్యార్థులు ఘన విజయాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.కె. నవీన్ నీట్-2026 లో అర్హత సాధించి సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందగా, ఎల్. సంతోష్ తెలంగాణ ఈఎంఆర్ఎస్ లో సైన్స్ విభాగంలో టాపర్ గా నిలిచాడు. వీరిద్దరూ గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని కలిసి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా కె. నవీన్ తో పాటు డీసీఓ శ్రీనివాస్ స్వామి, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ అమర్ సింగ్, ఈఎంఆర్ఎస్ గాంధారి ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్, టీజీటీ ఇంగ్లీష్ గోపాల్ మోండల్, ఎస్ఎస్ఏ ఎం. రవి కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ నవీన్ ను ప్రత్యేకంగా అభి నందించి, పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. వీరి విజయాలు గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

రామాయంపేట మున్సిపాలిటీలో చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ





రామాయంపేట నవంబర్ 17 మహాప్రభ
రామాయంపే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం కింద మంజూరైన పత్రాల పంపిణీ కార్యక్రమం రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా జరిగింది. రామాయంపేట పట్టణానికి సంబంధించిన లి142 మంది లబ్ధిదారులకు. గౌరవ మెదక్ ఎమ్మెల్యే శ్రీ మైనంపల్లి రోహిత్ గారు చేతుల మీదుగా చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు చేయూత పెన్షన్ ఎంతో ఆసరాగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లిశ్రీమతి గజవాడ లావణ్య నాగరాజు గారు వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పోచమ్మల నవనీత గణేష్ గారుమున్సిపల్ కమిషనర్ శ్రీ ఏ. రవీందర్ గారు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్



గాంధారి
నవంబర్ 17 (మహాప్రభ)
గాంధారి మండలంలోని చద్మల్ తండాలో ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన ఇళ్ల బాధిత కుటుంబాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ పరామర్శించారు.రైదాస్ హరిదాస్, రైదాస్ ప్రియాంక, ఇందల్ సింగ్ కుటుంబాల ఇళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధం కావడంతో బాధితులను కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, ఇందిరమ్మ ఇళ్ల నూతన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సింగ సాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు పరమేశ్వర్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వితంతు మహిళలు, వికలాంగులకు చేయూత పింఛన్ల పంపిణీ

-లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన పాలాటసర్పంచ్ సాయి గౌడ్,



మనోహరాబాద్ నవంబర్ 17(మహాప్రభ)
వితంతు మహిళలు, వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఈరోజు పాలట సర్పంచ్ సాయి గౌడ్, లబ్ధిదారులకు పింఛన్ మంజూరు సర్టిఫికెట్లను అందజేశారు. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న మహిళలు, వికలాంగులకు పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గ్రామ అధ్యక్షుడు పల్లెపు అశోక్ గ్రామస్తులు పాల్గొనడంజరిగింది

దేవరకొండలో 1,412 మందికి కొత్త పెన్షన్లు



దేవరకొండ డివిజన్ నవంబర్ 16 (మహాప్రభ)
దేవరకొండనియోజకవర్గంలో చింతపల్లి మండలానికే అత్యధికంగా 858 కొత్త పెన్షన్లు మంజూరు. కొండమల్లేపల్లి మండలంలో 554 మందికి పెన్షన్లు. రెండు మండలాల్లో కలిపి 1,412 మందికి కొత్తగా చేయూత. లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 60 వేల కొత్త పెన్షన్లు మంజూరు చేసిన రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం.
చింతపల్లి మండలంలో 858, కొండమల్లేపల్లి మండలంలో 554 మందికి పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ.వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, నేత కార్మికులకు ఆర్థిక భరోసాఅర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యంచింతపల్లిమండలంలోనే అత్యధికంగా 858 పెన్షన్లు మంజూరు కావడం విశేషంతెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదకుటుంబాలకు సామాజికభద్రతకల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలునాయక్ అన్నారు.
చింతపల్లి, కొండమల్లేపల్లి మండలాల్లో నిర్వహించిన చేయూత ఆసరా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. దేవరకొండ నియోజకవర్గంలో కొత్త పెన్షన్లమంజూరులోచింతపల్లి.మండలంఅత్యధికస్థానంలో నిలిచిందని తెలిపారు. చింతపల్లి మండలంలో858 మందికి, కొండమల్లేపల్లి మండలంలో 554 మందికి కలిపి మొత్తం 1,412 మందికికొత్తగాపెన్షన్లుమంజూరయ్యాయనివెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా అర్హులైన అనేకమంది పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ వారికి తగిన న్యాయం జరగలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాతముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4 లక్షల 60 వేల పెన్షన్లు మంజూరు చేసి పేదలకుఅండగానిలుస్తోందని తెలిపారు.పెన్షన్ అనేది పేదలు,వికలాంగులు, వితంతువులు,ఒంటరిమహిళలు, గీతకార్మికులు, నేతకార్మికులకు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని,వారి జీవితాలకు ఒక భరోసా అని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనం కల్పించాలన్నదే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పెన్షన్లు మంజూరు చేయడం ద్వారా ప్రజా ప్రభుత్వం తన సంక్షేమ నిబద్ధతనుచాటుకుంటోందని అన్నారు. దేవరకొండనియోజకవర్గంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి..
-ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాల ద్వారా పథకం అమలు చేయాలి
-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి -- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి నవంబర్ 17 మహాప్రభ
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా వనపర్తి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ప్రారంభం కానున్నందున అధికారులు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పథకం ఉద్దేశం, ప్రయోజనాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో బుధవారం టామ్ టామ్ వేయించాలన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులను గుర్తించి, ప్రతి ఒక్కరి చేత బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేయించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పథకం అమలులో భాగంగా ఈ నెల 18వ తేదీన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు తదితరులతో మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి, శిబిరాల నిర్వహణపై తగిన సూచనలు చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని, ఇందుకోసం అనువైన ప్రదేశాలను గుర్తించి కంప్యూటర్, టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు, ఫ్లెక్సీలు తదితర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వార్డుకు ఒకచోట ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ కుటుంబాలు ఉన్న గ్రామాల్లో క్యాంపు లో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తుల పంపిణీ, పూరించడం, ఇతర విధుల నిర్వహణలో వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, వార్డు అధికారులు, రేషన్ షాపు డీలర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

కుటుంబ యజమాని పేరిట బీమా దరఖాస్తు
కుటుంబాన్ని పోషించే యజమాని పేరిట బీమా దరఖాస్తు చేసుకోవాలని, 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. కుటుంబానికి సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం బీమా కంపెనీల సహకారంతో రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ కుటుంబ సభ్యుల్లో ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా సూచించేందుకు అవకాశం ఉన్నందున దరఖాస్తుల పూరణ సమయంలో ఈ వివరాలను సక్రమంగా నమోదు చేయించాలని తెలిపారు. రేషన్ కార్డుల ఆధారంగా లబ్ధిదారుల వివరాలతో ముందస్తుగా నింపిన దరఖాస్తులను రేషన్ షాపుల వారీగా సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, అటువంటి వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. లబ్ధిదారుల పూర్తి వివరాలు, సంతకాలతో కూడిన దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపరచాలని, వాటిని పోగొట్టడం లేదా నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ పడేయడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూరించిన దరఖాస్తులను రోజువారీగా సేకరించి, ఆన్లైన్ ఎంట్రీ చేసి భద్రపరచాలని ఆదేశించారు. దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ నమోదు సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లోని ఆపరేటర్లకు ఆన్‌లైన్ నమోదు విధానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. కంప్యూటర్, ప్రింటర్ సదుపాయాలు అందుబాటులో ఉంచి శిబిరాల్లో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు, లబ్ధిదారుల సంతకాల ప్రక్రియను అక్కడికక్కడే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు 50కుటుంబాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.

రోజువారీ పురోగతిపై పర్యవేక్షణ
ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని శిబిరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, రోజువారీ పురోగతి నివేదికలను జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పౌరసరఫరాల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఈ నెల 19వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని శిబిరాలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఈ సమావేశంలో డీ ఆర్ ఓ రామ్ రెడ్డి, డీ ఆర్ డీ ఓ ఉమాదేవి, సీపీవో హరికృష్ణ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ దినోత్సవ మహాసభ గోడపత్రిక విడుదల

ఆమనగల్లు, నవంబర్ 17(మహాప్రభ)
రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26 న సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం హాల్ ఎల్బీనగర్ లో సభ నిర్వహించడం జరుగుతుంది,ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొనడం జరుగుతుందని ఈ సభ బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది డాక్టర్ కదిరే కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. బహుజనసేన జిల్లా అధికార ప్రతినిధి వర్కాల శేఖర్ తెలిపారు, తెలంగాణ రాష్ట్రంలో గత కొంతకాలంగా ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ పీడిత ప్రజల నాయకులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిపై అసత్య ప్రచారాలు,దూషణలు, బలుపెక్కి బరితెగించి మాట్లాడుతుంటే కుల వాదులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం వచ్చిందని వర్కాల శేఖర్ తెలిపారు. అలాగే ఆ మహానుభావుడు త్యాగం వల్ల విద్య,రాజకీయ,ఉద్యోగ,ఆర్థిక రంగాలలో లబ్ధి పొందుతున్న వాళ్లందరూ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు.రాజ్యాంగ దినోత్సవ మహాసభకు ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ రిస్టులు, విద్యార్థులు, మేధావులు,కవులు, రచయితలు, కళాకారులు,ఆర్థికవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని కోరుచున్నాము ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జాతర ఫౌండర్ సుధాకర్, బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బొల్లు మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్,మాజీ వార్డ్ మెంబర్ మల్లేష్ నాయక్, బహుజన నాయకులు వెంకటేష్, పురుషోత్తం,పర్వతాలు, విజయ్, బావండ్ల వెంకటేష్,రాజు, వడ్డే వెంకటేష్,మాజీ సర్పంచ్ రాము, శేను,శివ తదితరులు పాల్గొన్నారు.



కరువు నేల నుంచి అభివృద్ధి బాట వరకు..
దేవరకద్ర ప్రగతి ప్రస్థానంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముద్ర

-రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా.. తొమ్మిదిన్నరేళ్లలో సాగునీటి నుంచి పట్టణీకరణ వరకు ప్రత్యేక గుర్తింపు.. చెరువులకు జలకళ, పల్లెలకు కొత్త రూపం.. అభివృద్ధి పనులతో చెరిగిపోని ముద్ర వేసిన మాజీ ఎమ్మెల్యే ఆల



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 17 మహాప్రభ

ఒకప్పుడు వాన కోసం ఎదురుచూసే రైతన్నలు.. సాగునీటి కోసం ఆకాశం వైపు చూసే పల్లెలు.. తాగునీటి ఇబ్బందులతో అల్లాడే గ్రామాలు.. సరైన మౌలిక వసతుల కోసం ఎదురుచూసే ప్రజలు.. ఇదీ ఒకనాటి దేవరకద్ర నియోజకవర్గ పరిస్థితి. కాలం మారింది.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.. రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. ఈ క్రమంలో దేవరకద్ర నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు.

2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి 2014 నుంచి 2023 వరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేశారు. సాగునీటి సమస్యను ప్రధాన అంశంగా తీసుకోవడంతో పాటు గ్రామీణ రహదారులు, చెక్‌డ్యాంలు, తాగునీరు, విద్య, వైద్యం, పట్టణాభివృద్ధి వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రాజకీయాలకతీతంగా దేవరకద్ర అభివృద్ధిని తన ప్రధాన బాధ్యతగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

సాగునీటి కలకు ప్రాధాన్యం.. రైతు కళ్లల్లో ఆనందం నింపే ప్రయత్నం!

దేవరకద్ర ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించడం ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రాధాన్యాల్లో ఒకటి. పక్కనే కృష్ణానది ఉన్నా సాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితిని మార్చాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలు, కాళ్వలు, చెరువుల పునరుద్ధరణ వంటి అంశాలపై దృష్టి సారించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కరివెన రిజర్వాయర్, కురుమూర్తిరాయ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ స్థాయిలో కృషి చేశారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు సాగునీరు చేరేలా సంబంధిత పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు.

దేవరకద్ర, చిన్నచింతకుంట, అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, కొత్తకోట, మదనాపూర్ మండలాల పరిధిలో సాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చారు.

రైతు పొలంలో నీరు పారితేనే పల్లెల్లో పచ్చదనం ఉంటుందనే ఆలోచనతో చెరువులు, వాగులు, వంకల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఇంకా పూర్తికావాల్సిన పనులు ఉన్నప్పటికీ, ఈ రంగంలో చేపట్టిన ప్రయత్నాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమైన అంశంగా నిలిచాయి.

చెక్‌డ్యాంల నిర్మాణం.. వాగులకు జీవం.. భూగర్భ జలాలకు భరోసా!

వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా స్థానికంగానే నిల్వ ఉండాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారు. సుమారు 30 చెక్‌డ్యాంల నిర్మాణం ద్వారా వాగులు, వంకల్లో నీటి నిల్వకు అవకాశం కల్పించారు.

మిషన్ కాకతీయ పథకం కింద 309 చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు సుమారు రూ.102 కోట్ల నిధులు వెచ్చించినట్లు అప్పటి అభివృద్ధి నివేదికల్లో పేర్కొన్నారు.

ఈ పనుల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే.. వానాకాలంలో వచ్చిన నీటిని నిల్వ చేసి, భూగర్భ జలాలను పెంచి, రైతులకు సాగునీటి వెసులుబాటు కల్పించడం. చెరువుల పునరుద్ధరణతో గ్రామీణ వ్యవసాయానికి ఊతమిచ్చే ప్రయత్నం జరిగింది.

ప్రతి ఇంటికీ తాగునీరు.. మిషన్ భగీరథతో గ్రామాలకు కొత్త ఊరట!

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తాగునీటి కోసం పడే కష్టాలను తగ్గించేందుకు మిషన్ భగీరథ పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 230 వాటర్ ట్యాంకుల నిర్మాణం, 730 కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటు కోసం రూ.95 కోట్ల మేర పనులు చేపట్టినట్లు ప్రచురిత గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

తాగునీటి కోసం బిందెలు పట్టుకుని వెళ్లే పరిస్థితికి ముగింపు పలకాలనే లక్ష్యంతో ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందించే వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు పడ్డాయి.

పల్లెలను కలిపిన రహదారులు.. తండాలకు బీటీ రోడ్లు! గ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా రవాణా సదుపాయం మెరుగుపడాలనే ఆలోచనతో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారు.

నియోజకవర్గంలో 52 గ్రామాలకు బీటీ రోడ్లు, 64 తండాలకు బీటీ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు అప్పట్లో ఆల వెల్లడించారు. పలు ప్రాంతాల్లో వంతెనలు, కాజ్‌వేలు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులు కూడా జరిగాయి. మూసాపేట మండలం కందూరు అనుబంధ గ్రామమైన గౌరిదేవునిపల్లికి వెళ్లేందుకు పెద్దవాగుపై రూ.2.35 కోట్లతో నిర్మించిన కాజ్‌వే అందులో ఒకటి.

ఒకప్పుడు వర్షం వస్తే రాకపోకలకు ఇబ్బందులు పడే ప్రాంతాల్లో రహదారి సదుపాయాలు మెరుగుపడటం ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతుల కల్పనలో భాగమైంది.

దేవరకద్రకు 100 పడకల ఆసుపత్రి.. వైద్య సేవలకు కొత్త దిశ!

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేశారు. కొత్తకోటలో 30 పడకల వైద్యశాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకున్నారు. ప్రజలు చిన్నపాటి వైద్య అవసరాలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలనే లక్ష్యంతో వైద్య మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చారు.

అదేవిధంగా పశువైద్య సేవల కోసం దేవరకద్రలో రూ.20 లక్షలతో నిర్మించిన పశువైద్యశాలను ప్రారంభించారు. రైతులకు, పశుపోషకులకు అవసరమైన సేవలను స్థానికంగానే అందించేందుకు ఇది ఉపయోగపడే సదుపాయం. విద్యారంగానికి ప్రోత్సాహం.. గురుకులాల ఏర్పాటుతో గ్రామీణ విద్యార్థులకు అవకాశం!

పల్లెల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలు, కళాశాలల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉన్నత విద్య కోసం పట్టణాలకు వెళ్లాల్సిన విద్యార్థులకు స్థానికంగానే మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో విద్యా మౌలిక వసతుల విస్తరణకు కృషి చేశారు.

విద్య ద్వారానే గ్రామీణ ప్రాంతాల భవిష్యత్తు మారుతుందనే భావనతో ఈ రంగంలో ప్రభుత్వ పథకాలు, సంస్థల ఏర్పాటుకు తోడ్పడ్డారు.

కొత్తకోట, భూత్పూర్‌కు మున్సిపాలిటీ హోదా.. పట్టణాభివృద్ధికి బాటలు!

గ్రామీణ ప్రాంతాలను పట్టణాభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో కొత్తకోట, భూత్పూర్ మున్సిపాలిటీల ఏర్పాటు కీలక పరిణామంగా నిలిచింది. పరిపాలనా సౌలభ్యం, పట్టణ మౌలిక వసతుల విస్తరణకు ఈ నిర్ణయం దోహదపడింది. దేవరకద్ర మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో 30 నూతన గ్రామపంచాయతీల ఏర్పాటుకు కూడా కృషి జరిగింది. తండాలకు ప్రత్యేక గ్రామపంచాయతీ హోదా కల్పించడంతో స్థానిక ప్రజలకు పరిపాలన మరింత చేరువయ్యే అవకాశం ఏర్పడింది.

కొత్తకోట మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆల వెల్లడించారు. పట్టణాల అభివృద్ధి, డ్రైనేజీ, రహదారులు, వీధి సదుపాయాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రైతుబంధు నుంచి రైతుబీమా వరకు.. అన్నదాతకు అండగా సంక్షేమం!

అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదు.. రైతు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడం కూడా అభివృద్ధిలో భాగమే. ఈ ఆలోచనతో అప్పటి ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గంలో 92,126 మంది రైతులకు రైతుబంధు కింద సుమారు రూ.950 కోట్లు అందినట్లు నివేదికలు పేర్కొన్నాయి. రైతుబీమా పథకం ద్వారా వివిధ కారణాలతో మరణించిన 1,900 మంది రైతుల కుటుంబాలకు సుమారు రూ.99.50 కోట్ల ఆర్థిక సహాయం అందినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే గొర్రెల పంపిణీ పథకం కింద గొర్రెల పెంపకందారులకు ఆర్థికంగా తోడ్పాటు అందించే కార్యక్రమాలు చేపట్టారు.

రైతులకు పెట్టుబడి సాయం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పంటలకు సాగునీరు వంటి అంశాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా అమలయ్యాయి.

పరిశ్రమలు, ఉపాధి.. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం!

నియోజకవర్గంలో పరిశ్రమల అభివృద్ధి కూడా మరో ముఖ్యమైన అంశం. కోజెంట్ పరిశ్రమ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించేందుకు సుమారు రూ.500 కోట్ల పెట్టుబడితో ముందుకు వచ్చినట్లు అప్పటి వార్తా కథనాలు పేర్కొన్నాయి. పరిశ్రమల విస్తరణతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగాలనే ఆశలు ఏర్పడ్డాయి. వ్యవసాయంతో పాటు ఇతర రంగాల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు పెరగడం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమనే దిశలో ప్రయత్నాలు జరిగాయి.

ప్రజలకు చేరువగా.. సంక్షేమ పథకాల అమలులో భాగస్వామ్యం!

ప్రజాప్రతినిధిగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరాలనే లక్ష్యంతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్, గృహలక్ష్మి వంటి పథకాల లబ్ధిదారులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు.

అప్పట్లో సుమారు 11 వేల మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించినట్లు ఆల వెల్లడించారు. అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో ఈ పథకాలు ఉపయోగపడ్డాయి.

రూ.5,778 కోట్ల అభివృద్ధి ప్రస్థానం!

2014 నుంచి 2023 వరకు దేవరకద్ర నియోజకవర్గంలో సుమారు రూ.5,778 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలైనట్లు అప్పటి ప్రచురిత నివేదికల్లో పేర్కొన్నారు.ఈ మొత్తంలో వివిధ ప్రభుత్వ శాఖలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల పనులు ఉన్నాయి. ప్రతి రూపాయి వెనుక ఒక గ్రామం అవసరం.. ఒక రైతు ఆశ.. ఒక కుటుంబం ఎదురుచూపు ఉందనే కోణంలో ఈ అభివృద్ధి ప్రస్థానాన్ని చూడాల్సి ఉంటుంది.సాగునీటి ప్రాజెక్టుల నుంచి గ్రామీణ రహదారుల వరకు, చెరువుల పునరుద్ధరణ నుంచి తాగునీటి సరఫరా వరకు, ఆసుపత్రుల నుంచి మున్సిపాలిటీల ఏర్పాటు వరకు.. దేవరకద్ర అభివృద్ధిలో పలు రంగాల్లో పనులు జరిగాయి.

రాజకీయ పదవికి మించి.. అభివృద్ధి పనులే అసలైన గుర్తింపు!

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ ఒక ప్రజాప్రతినిధి పనిచేసిన కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుబాటులోకి వచ్చిన మౌలిక వసతులు మాత్రం చరిత్రలో నిలిచిపోతాయి.

2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ, ఆయన రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించిన దేవరకద్ర నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నేటికీ చర్చకు వస్తున్నాయి.ఒకప్పుడు కరువు సమస్యలతో సతమతమైన ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, తాగునీటి పథకాలు, రహదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మున్సిపాలిటీల ఏర్పాటు వంటి అంశాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. పదవి అనేది ఐదేళ్లకోసారి మారొచ్చు.. కానీ ప్రజల అవసరాల కోసం చేపట్టిన పనులు మాత్రం తరతరాలకు గుర్తుండిపోతాయి. దేవరకద్ర అభివృద్ధి ప్రస్థానంలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరు ప్రస్తావనకు రావడానికి ఇదే ప్రధాన కారణం.రాజకీయాల్లో విమర్శలు ఉంటాయి.. భిన్నాభిప్రాయాలు ఉంటాయి.. కానీ అభివృద్ధి పనుల విషయంలో ప్రజల అనుభవమే అసలైన కొలమానం. దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా సాగించిన ప్రస్థానం అలాంటి ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.

ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణే లక్ష్యం

-సాంబవరం, కాండ్లపల్లి, జిల్లెల్ల గ్రామాల్లో గోస్పాడు పోలీసుల ఫ్లాగ్ మార్చ్



నంద్యాల క్రైమ్ నవంబర్ 17(మహాప్రభ)

నంద్యాల జిల్లా:రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రజల్లో భరోసా కల్పించేందుకు గోస్పాడు పోలీసులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంబవరం, కాండ్లపల్లి, జిల్లెల్ల గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా పోలీసు బలగాలు కవాతు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును స్వతంత్రంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా లేదా ఓటు వేయకుండా అడ్డుకున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో రాజకీయ విభేదాలు, వ్యక్తిగత కక్షలు పెంచుకోకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినా, గొడవలకు పాల్పడినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా ముగిసేందుకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజలు పోలీసులకు సహకరించి ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలని కోరారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి.

-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.



నంద్యాల నవంబర్ 17(మహాప్రభ)

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డి ఐ ఈ పీ సి) సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల ద్వారా అందిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న అనుమతుల పై సమీక్షిశీచిన జిల్లా కలెక్టర్. ఈ సమావేశంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిశీలన, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు, వివిధ రాయితీల మంజూరు అంశాల పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు కోరిన అనుమతులను కోలతలు లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. మొత్తం 53 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా 40 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయగా, 13 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, పరిశ్రమల అభివృద్ధి అధికారులు , డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.1,00,116 విరాళం అందజేత

నవంబర్ 17(మహాప్రభ)శ్రీశైలం, నవంబరు 17:



శ్రీశైల క్షేత్రంలో భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తూ విరాళాలు సమర్పించారు. ఇందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన శ్రీమతి పి. దుర్గాభవాని మంగళవారం (17.11.2026) అన్నప్రసాద వితరణకు రూ.1,00,116/- (ఒక లక్షా నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ విరాళ మొత్తాన్ని దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరియానాయక్, పర్యవేక్షకులు సి.హెచ్. కోమలి స్వీకరించారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం తరఫున తగిన రశీదుతో పాటు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి గౌరవించారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు అందిస్తున్న విరాళాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

నల్లగొండ వన్‌టౌన్ సీఐగా సంధ్య పోగుల క్రాంతి కుమార్ బాధ్యతల స్వీకరణ

- సంగారెడ్డి నుంచి నల్లగొండకు బదిలీ..

- అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం



నల్లగొండ, నవంబర్ 17 మహాప్రభ

నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా సంధ్య పోగుల క్రాంతి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా నుంచి నల్లగొండకు బదిలీపై వచ్చిన ఆయన గతంలో నల్లగొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి విక్రయాలు, అక్రమ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా డయల్ 112 ద్వారా లేదా నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

రూ. 139 కోట్ల బాక్సాఫీస్ సంచలనం..

-ఓటీటీలోకి కన్నడ బ్లాక్‌బస్టర్ 'ప్రేమద ఊరలి'!



కన్నడ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'ప్రేమద ఊరలి' సినిమా ఎట్టకేలకు ఓటీటీలోకి అడుగుపెట్టింది. కేవలం 60 షోలతో చాలా సాధారణంగా థియేటర్లలో విడుదలై, మౌత్ టాక్‌తో భారీ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం రూ. 139 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను రాబట్టి చరిత్ర సృష్టించింది. కాగా, థియేటర్లలో విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకున్న ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా నవంబర్ 17 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో డిజిటల్ స్ట్రీమింగ్‌ను ప్రారంభించింది. మరోవైపు తెలుగులో కూడా ఈ చిత్రం ప్రేమనే ఊరిలో అనే పేరుతో విడుదలై పాజిటివ్ టాక్‌ని తెచ్చుకుంది.మనోజ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రంగాయణ రఘు, శ్రీ రామ్, రామిక శివు మరియు తపస్విని పూనాచ ప్రధాన పాత్రల్లో నటించారు. భార్య మరణం తర్వాత తన కుమారుడు సంతును పెంచే ఒక సాధారణ రైతు నాగన్న (రంగాయణ రఘు) జీవితం మరియు వారి కుటుంబ బంధాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ప్రచార ఆర్భాటం లేకుండా కేవలం 60 షోలతో మొదలైన ఈ సినిమా, కుటుంబ ప్రేక్షకుల ఆదరణతో క్రమంగా పుంజుకుని కర్ణాటక వ్యాప్తంగా 450కి పైగా కేంద్రాలకు విస్తరించింది. నాని నటించిన 'ది ప్యారడైజ్' మరియు శివరాజ్‌కుమార్ 'బెయిల్' వంటి భారీ చిత్రాల పోటీని తట్టుకుని నిలబడిన ఈ చిత్రం, విడుదలైన 26 రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. సుమారు 53 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 139.32 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి కన్నడ సినీ పరిశ్రమలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. వానిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్, జనకమ్మ ప్రొడక్షన్స్, పతాకాలపై మమత దేవేంద్ర, ప్రశాంత్ డి.ఎస్, రమేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి సునాద్ గౌతమ్ సంగీతం అందించగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం థియేటర్లలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.

ధురంధర్'కి నిరాశ..

- గ్రామీ నామినేషన్లలో చోటు దక్కని రణ్‌వీర్ సింగ్ చిత్రం



బాలీవుడ్ స్టార్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' చిత్రానికి సంగీత విభాగంలో 2027 గ్రామీ అవార్డుల్లో నిరాశ ఎదురైంది. ఈ సినిమా నుంచి వివిధ విభాగాల కింద ఎనిమిది పాటలను గ్రామీ అవార్డుల కోసం ప్రతిపాదించినప్పటికీ, తుది నామినేషన్లలో చోటు దక్కించుకోలేకపోయాయి. శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందాయి. దీంతో అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు వస్తుందని చిత్ర యూనిట్ గట్టిగా ఆశించింది. అయితే, నవంబర్ 16న ప్రకటించిన గ్రామీ నామినేషన్ల జాబితాలో ఈ ఆల్బమ్ నిలవలేకపోయింది. ఇక 'ధురంధర్' చిత్రానికి నిరాశ ఎదురైనప్పటికీ, ఈసారి గ్రామీ వేదికపై భారత్ తరఫున మరొక పాటకు చోటు దక్కింది. దేవన్ ఏకాంబరం, సుషాల స్వవరూపంలో వచ్చిన తమిళ గీతం 'వరువాయ్'.. 'బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' విభాగంలో నామినేషన్ సాధించింది. గ్రామీ చరిత్రలో ఒక తమిళ పాట నామినేట్ కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.



పెళ్లి తప్పనిసరి కాదు!

అగ్ర కథానాయిక శృతిహాసన్ ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంది. తాజాగా పెళ్లి గురించి ఈ భామ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రతీ ఒక్కరి జీవితంలో తోడు ముఖ్యమేనని, అయితే అందుకోసం పెళ్లి చేసుకోవడం తప్పనిసరి కాదని అభిప్రాయపడింది. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె ఈ విషయం గురించి మాట్లాడింది. 'పెళ్లికి నేను వ్యతిరేకం కాదు. కానీ పెళ్లి కోసం పత్రాలపై సంతకాలు చేయడం, భారీగా డబ్బులు ఖర్చు పెట్టి వేడుకలు చేయడం ఎవరిని సంతృప్తిపరచడానికో అర్థం కాదు.నేను కొన్ని విషయాల్లో సంప్రదాయబద్ధంగా ఉంటాను. మరికొన్ని విషయాల్లో నా ఆలోచనలు ప్రాక్టికల్‌గా ఉంటాయి' అని శృతిహాసన్ చెప్పింది. శృతిహాసన్ గతంలో ఆర్టిస్టు శంతను హజారికాతో నాలుగేళ్ల పాటు ప్రేమలో ఉంది. 2024లో వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోయారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో శృతిహాసన్ కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే.

పెళ్లి గిల్లీ సెట్టవ్వవు.. అప్పట్లో తాగేదాన్ని కానీ ఇప్పుడు..



అషూరెడ్డి..! టిక్‌టాక్ వీడియోలు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో సోషల్ మీడియాలో జూనియర్ సమంతగా మంచి పాపులారిటీ సంపాదించుకుంది ఈ బ్యూటీ. ఆ తర్వాత బుల్లితెరపై యాంకర్‌గా అడుగుపెట్టి తన ట్యాలెంట్ చూపించింది. గతంలో వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో చేసిన బోల్డ్ ఇంటర్వ్యూ.. రీసెంట్‌గా తాను జీవితంలో పెళ్లి చేసుకోనంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. దాంతో పాటే తన డ్రింకింగ్ అలవాటు గురించి కూడా చెప్పుకొచ్చింది. ఓ షోలో పెళ్లి మీద మీ అభిప్రాయం ఏంటని ఆషూను హోస్ట్ అడగ్గా.. థూ అని ఉమ్మేసి అందర్నీ షాకయ్యేలా చేసింది ఆషురెడ్డి. 'ప్రేమ, పెళ్లి అనేవి నా మైండ్‌లోనే కాదు మనసులో కూడా లేవు. ఒకవేళ భవిష్యత్తులో ఎప్పుడైనా వస్తే అప్పుడు చూస్తాను' అని చెప్పుకొచ్చింది ఆషూరెడ్డి. ఇక డ్రింకింగ్ అలవాటు గురించి మాట్లాడుతూ.. ' బ్యాడ్ పీపుల్‌తో ఏదైతే జర్నీ చేశానో అప్పుడు డ్రింకింగ్ అలవాటు ఉండేది. అయితే తాగి నా ఆరోగ్యం పాడుచేసుకోవాలనుకోవట్లేదని కొన్నాళ్లకు నాకు అర్థమైంది. అప్పుడే ఆపేసి రోజూ జిమ్‌కి వెళ్లడం మొదలుపెట్టాను. ఎందుకంటే మన శరీరమే మనకు దేవాలయం. దాన్ని నువ్వు బాగా చూసుకుంటే అది ఎప్పటికైనా నిన్ను కాపాడుతుంది. ఈ ఆలోచన రాకముందు వరకుతాగేదాన్ని' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బిగ్ బాస్ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. దాంతో పాటే గతంలో ఆషురెడ్డి పెళ్లి పేరుతో మోసం చేసిందనే న్యూస్‌ను కూడా కొంత మంది నెటిజన్లు బయటికి తీసి.. ఈమెను నెట్టింట ట్రోల్ చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ 'రణబాలి'కి

ఓటీటీలో అద్భుతమైన స్పందన..



విజయ్ దేవరకొండ హీరోగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. థియేటర్ల తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అడుగుపెట్టిన ఈ చిత్రానికి ఊహించని విధంగా భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులతో పాటు వివిధ భాషల ప్రేక్షకులు ఈ సినిమాపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు.ఈ చిత్రంలో చూపించిన చారిత్రక సంఘటనలు, బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చకు దారితీశాయి. కొంతమంది బ్రిటన్ నెటిజన్లు సినిమాలో చూపించిన బ్రిటిష్ పాలన విధానాలపై స్పందిస్తుండగా, మరికొందరు వలసవాద పాలనలో భారతీయులు పడిన నష్టాలు మరియు జరిగిన దారుణాలను గుర్తుచేస్తూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, పవర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా అద్భుతంగా నటించారని నెటిజన్లు కొనియాడుతున్నారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ టేకింగ్, చరిత్రను నిజాయితీగా తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసల జల్లు కురుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించగా, టి-సిరీస్ సమర్పించింది. మొత్తానికి ఓటీటీలో వస్తున్న రెస్పాన్స్‌తో 'రణబాలి' సినిమా సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది.

యుద్ధం రాముడితోకాదు.. రాజ్యంతో



కొణిదెల పవన్‌తేజ్ హీరోగా నటిస్తున్న రూరల్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ లవ్‌స్టోరీ 'జంట'. పాడనికుమార్ కథానాయిక. రాజశేఖర్ యాదవ్ దర్శకుడు. రాజేశ్ గునిశెట్టి, వీరు యాదవ్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. రాజకీయప్రముఖులు మెట్ల రమణబాబు, అయితాబత్తుల ఆనందరావు ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా ఓ భావోద్వేగ ప్రయాణం. మాస్ ఎలిమెంట్స్ మెండుగా ఉంటాయి. ఇలాంటి కథ ఇప్పటివరకూ రాలేదు. 'యుద్ధం రాముడితో కాదు..రాజ్యంతో..' అనే క్యాప్షన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని కొణిదెల పవన్‌తేజ్ అన్నారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: నత్మిక మధు, కెమెరా: రాహుల్ శ్రీవాస్తవ, సంగీతం: సుభాష్ ఇషాన్.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com